# వెంటాడిన నీడ.

"అదుగో మీ మహాలక్ష్మి వస్తోంది" అన్నాడు శివయ్య భార్యతో.

"ఎక్కడా?" అంటూ నుదుటికి చేయి అడ్డం పెట్టుకుని వీధివైపు చూసింది నర్సమ్మ.

కొంచెం దూరంలో చంకనుంచి ఓ సంచీ జారిపోతుంటే, మరోవైపున భుజాన ఏణ్ణార్థం పిల్లని వేసుకుని వస్తూ అన్నపూర్ణ కనిపించింది.

"మహాలక్ష్మీ లేదు, మట్టిగడ్డలూ లేదు. వట్టి ఇనప గజ్జల తల్లి. ఈసారీ వట్టి చేతులతోనే వచ్చింది. ఆ ముఖం చూస్తే తెలీడం లేదూ?" అంటూ మెటికలు విరిచింది నర్సమ్మ.

"మన పిచ్చిగానీ వాళ్ళేమిస్తారే. అదిగో సంచీలో కనిపిస్తోంది. సొరకాయ దొడ్లో పండేదేగా! ఓటికోసి పైసలు బదులు పంపించారు. ఈ శనివదిలితేనేకాని మన నారాయణకి మరో మంచి సంబంధం రాదు" అన్నాడు శివయ్య కసిగా.

అన్నపూర్ణ ఇంట్లోకి వచ్చింది. ఉస్సూరనుకుంటూ చేతిసంచిని నేలమీద దించి గదిలో ఉయ్యాలవైపు వెళ్ళింది.

"ఏం తల్లీ .... ఈసారైనా మీ నాయన పైసలు పంపించాడా? సొరకాయతో సరిపెట్టుకో మన్నాడా?" అంటూ సంచివైపు చూస్తూ అడిగింది నర్సమ్మ.

"పాపను పడుకోబెట్టి వస్తానత్తయ్యా" అంటూ లోనికి వెళ్ళింది అన్నపూర్ణ.

నిద్రపోతున్న పాపను ఉయ్యాలలో పడుకోబెట్టి వస్తుంటే .....

"ఏం కోడలు తల్లీ ... సమాధానం చెప్పడానికి ఇంకా ముహూర్తం రాలేదా?!" అంది నర్సమ్మ వెటకారంతో, జేవురించిన ముఖంతో.

"కాళ్ళ కడుక్కుని రానీంతడత్తయ్యా" అంటూ బాత్‌రూం వైపు దారితీసింది అన్నపూర్ణ.

"చూశావా ..... సమాధానం చెప్పకుండా ఎలా దాటవేస్తోందో! నోటితో చెప్పకపోయినా తెలీడం లేదా వట్టి చేతుల్తో వచ్చిందని" అన్నాడు శివయ్య కోడలు వెళ్ళినవైపు చూస్తూ.

"ఏమిటి నాన్నా అంటున్నావు? అన్నపూర్ణ వచ్చిందా?" అంటూ కళ్ళ నలుముకుంటూ వస్తూ అడిగాడు నారాయణ. ఎనిమిది గంటలు అవుతుంటే ఇంకా లేవాలని అనిపించలేదు ఆ పెద్దమనిషికి.

ఆరోజు శుక్రవారం. బస్ కండక్టర్ ఉద్యోగం చేసే నారాయణకి ఆరోజు ఆఫ్.

"ఆ ... ఆ .... వచ్చింది. అదుగో సంచినిండా పోసి సొమ్ములు తెచ్చింది" అంటూనే మీదున్న సంచీవైపు చూపించాడు శివమ్మ.

"ఒరేయ్. లక్ష రూపాయల కట్నం వచ్చే లక్షణమైన సంబంధాలు చూడకుండా ఈ ముదనష్టపుదాన్ని కట్టబెట్టి నీ గొంతు కోశాంరా. ఇది పోతేనేకాని నీ శని విరగడ కాదురా" అంటూ

తిట్ల పంచాంగం అందుకుంది నర్సమ్మ.

ముఖం కడుక్కుని వస్తూన్న కోడల్ని చూస్తూ "ఏమే. సూటిగా చెప్పు. మీనాన్న పైసలు పంపాడా లేదా?" అంటూ ముఖం చింపుకుంటూ అడిగింది.

"ఎంత ప్రయత్నించినా దొరకలేదు అత్తయ్యా. అయినా మీకివ్వాల్సిన కట్నం ఇచ్చేశారుగా. మళ్ళీ ఇరవైవేలు తెమ్మంటే ఎక్కడినుంచి తెస్తారు?" అంది అన్నపూర్ణ.

"ఏమి కట్నం ఇచ్చారే! బోడి ముప్పయి వేలేగా. ఇప్పుడు రెండోవాడికి ఏభైవేల కట్నంతో పిల్ల వస్తోంది. తనకంటే తమ్ముడికి ఎక్కువ కట్నం వస్తే వాడికి తల తీసేసినట్లుండదూ? ఏమంటావురా నారాయణ" అంది నర్సమ్మ.

"కాదు మరీ! అయినా డబ్బులు ఇస్తే వాళ్ళమ్మాయేగా సుఖపడేది!" అన్నాడు నారాయణ అదేదో ఘనకార్యమన్నట్లు.

"పైసలు లేకుండా తిరిగి ఇంట్లో అడుగుపెట్టవద్దన్నానా? మరి ఎందుకు వచ్చినట్లు! మనిషన్నాక కాస్తో కూస్తో సిగ్గుండాలి" అన్నాడు శివయ్య.

"స్నానం చేసి వస్తాను" అంటూ కళ్ళనీళ్ళు కారుతున్న ముఖాన్ని పక్కకి తిప్పుకుంటూ పోయింది అన్నపూర్ణ.

ఆ పుణ్యదంపతులు, ఉత్తమ పుత్రుని కళ్ళు కలుసుకున్నాయి. వాటితో అవే ఏవేవో సైగలు చేసుకున్నాయి. వినిపించకుండా మాట్లాడుకున్నాయి. కోడలి వెనకాలే పిల్లిలా చప్పుడు కాకుండా నడుస్తూ వెళ్ళింది నర్సమ్మ. అన్నపూర్ణ బాత్‌రూం తలుపు తీసుకుని లోపలికి వెళ్ళిందో లేదో తలుపు మూసేలోపలే తానూ జొరబడింది. విస్తుపోయి వెనక్కి చూసిన అన్నపూర్ణ అరవకుండా నోరు గట్టిగా అదిమిపట్టి; మరో చేత్తో కదలకుండా పట్టుకుంది. సర్వసన్నద్ధంగా ఉన్న శివయ్య కిరసనాయిలు డబ్బాతో వెనకాలే వచ్చాడు. రుద్రాభిషేకం చేస్తున్న కోడలినెత్తిన ఆ కిరసనాయిలు గుమ్మరించాడు. తన వంతు కర్తవ్యంగా అగ్గిపెట్టె తీసుకువచ్చాడు నారాయణ.

భార్యామణి కోడల్ని కదలకుండా పట్టుకుని వుంటే ఆమె కాళ్ళూ, చేతులూ నోరు కట్టేసి "ఊ .... కానీ ...." అన్నాడు శివయ్య.

వెంటనే అగ్గిపుల్ల గీసి భార్య బట్టలమీద పడేశాడు పితృవాక్య పాలకుడైన నారాయణ. భగ్గుమంటూ మంటలు లేచి అన్నపూర్ణను నిలువునా దహించి వేయసాగాయి.

తమ ఒళ్ళు ఎక్కడ కాలుతోందన్న భయంతో ఆదర్శదంపతులూ, పుణ్యపురుషుడూ బయటకు పరిగెత్తుకు వచ్చేశారు. కాళ్ళూ చేతులూ కట్టిపడవేసిన అన్నపూర్ణ ఎంత గీజుకున్నా బయటకు రాలేకపోయింది.

నోరు కట్టేసి ఉండటంతో మాటపెగల్లేదు. కొంచెం సేపటికి కాళ్ల కట్లూడాయి. వెంటనే బయటకు పరుగెత్తుకుంటూ బిడ్డ ఉన్న ఉయ్యాలవైపు వచ్చింది. ఈలోగా చేతులకట్లు కూడా రాలి ఊడాయి. వెంటనే మూతికట్టు లాగేసుకుని బాధతో భయంకరంగా పెడబొబ్బలు పెడుతూ ఉయ్యాలలో<్చి పిల్లను తీసుకోబోయింది. కాని తీసుకోలేక కుప్పకూలిపోయింది అచేతనంగా.

ఆ కేకలు ఇరుగుపొరుగు వారు పరుగుపరుగున వచ్చారు. వాళ్ళని చూడగానే "ఎంత పని చేశావే అమ్మా. నీకు ఇలాంటి బుద్ధి ఎందుకు పుట్టిందే తల్లీ!" అంటూ శోకాలు మొదలుపెట్టింది నర్సమ్మ.

"నన్ను అన్యాయం చేసి పోయావా పూర్ణా" అంటూ తలకొట్టుకోసాగాడు నారాయణ.

"నీకు ఏం అన్యాయం చేశామని ఇంత పనిచేశావు కోడలా?! ఆ పసికందుని ఏం చేద్దామనుకున్నావు?" అంటూ నెత్తిన చేతులు పెట్టుకుని భోరుమన్నాడు శివయ్య.

ఈ శోకాలు ఇలా సాగుతుండగానే ఇరుగు పొరుగు వారు కల్పించుకుని అన్నపూర్ణ మీద దుప్పటి కప్పి మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మరణ వాఙ్మూలంకూడా లేకుండా స్పృహ రాకుండానే కన్నుమూసింది ఆమె. పోస్టుమార్టమ్, పోలీస్ రిపోర్టు, పంచాయతీ వగైరాలన్నీ మామూలుగానే పూర్తి అయ్యాయి.

ఈలోగా అన్నపూర్ణ తల్లిదండ్రులకు కబురంది నెత్తీనోరూ కొట్టుకుంటూ వచ్చారు. ఇది కట్నం హత్య అని కంప్లైయింట్ ఇచ్చారు వాళ్ళు. తల్లిని పొట్టపెట్టుకున్న ఆ రాక్షసులు పిల్లని మాత్రం ఏం చేస్తారని ఆ పసిగుడ్డును వారితో తీసుకుపోయారు. పిల్ల అడ్డుగా ఉంటే మంచికట్నంతో మారు సంబంధం రాదని తెలిసి ఆ ప్రబుద్ధులు మాట వరుసకి ముందు వద్దన్నా, ఆ తర్వాత అడ్డుచెప్పలేదు.

అన్నపూర్ణ ఆత్మహత్య చేసుకొందని చెప్తూ, అందుకు రకరకాల కారణాలు కల్పించి చెప్పసాగారు శివయ్యా, నర్సమ్మ, నారాయణలు. వాళ్ళేమి చెప్పినా అది కట్నం హత్య అని అందరికి తెలుసు. ఆమెను దొరికిందే తడవుగా పోలీసులు వాళ్ళని దబాయించి, బెదిరించి దండిగా డబ్బు దండుకున్నారు.

ఇరుగుపొరుగు అమ్మలక్కలు పరామర్శ నెపంతో వస్తూ పరోక్షంగా ఈసడింపు మాటలూ, బెదిరింపు మాటలు అనడం మొదలుపెట్టారు.

"శుక్రవారం పూట ఇంట్లో పునిస్త్రీ పోయిందంటే ఆ పీడ ఊరికే పోదు. బలికోరుతుంది. నెల తిరక్కుండా మరో ప్రాణం తీస్తుంది. ఎవరికి రాసి పెట్టుందో ఏమో! ఎందుకైనా మంచిది. తగిన శాంతి చేయించండి" అంటూ కొందరు భయపెడ్తే, "ఇది మామూలు చావా ఏమన్నానా? బలవన్మరణం. ప్రాణంపోడానికి ఆ జీవి ఎంత కొట్టుకుందో! బలవన్మరణం పొందినవారు తప్పకుండా దయ్యం అవుతారు. ఏ గణావారినో, మంత్రగాడినో పిలిపించి అందరూ రక్షలు కట్టించుకోండి. ఇంటి గుమ్మాలకు యంత్రాలు బిగింపించండి" అంటూ మరొకరు సలహా ఇవ్వసాగారు.

"తల్లికి పసిబిడ్డపై తగని వ్యామోహం ఉంటుంది. అందుచేత ఆమె ఆత్మ ఉయ్యాలచుట్టూ తిరుగుతూనే ఉంటుంది. పోయిన మనిషైతే ఇంక వచ్చి తీరుతుంది" అంది మరొకామె.

"పిల్లదాన్ని వాళ్ళ తాతగారు తీసుకుపోయారుగా సిన్నమా" అంది నర్సమ్మ.

"అయ్యో పిచ్చిదానా! తల్లికి తెలిసినంతవరకు పిల్ల ఎక్కడుంది? ఉయ్యాలలోనే కదా! అదే లెక్క! ఆత్మ అక్కడే తిరుగుతుంటుంది. నాకు బాగా తెలుసు. మా తోటికోడలు ప్రాణం తీసుకున్నప్పుడూ ఇలాగే అయింది. అష్టకష్టాలు పడి ఎంతో ఖర్చయితేనే కాని ఆ ఆత్మరాకుండా చేయలేకపోయాం" అంది ఒక వృద్ధమాత అనుభవజ్ఞానంతో.

ఈ మాటలన్ని వింటూంటే పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి నర్సమ్మకి. అమ్మలక్కలు వెళ్ళిపోయాక ఈ మాటలన్నీ భర్తకీ, కొడుకుకీ చెప్తుండేది. ఆమాటలు వింటుంటే వాళ్ళ గుండెలు అవిసిపోయేవి. వాళ్ళంతా ఎంతగా బెదిరిపోయారంటే, చీకటి పండిందంటే చాలు ముగ్గురూ ఒకేచోట ఉండేవారు. ఎవ్వరికీ సరిగా నిద్రపట్టేది కాదు. అవతలికి వెళ్ళాల్సి వచ్చినా, ఇంకొర్ని లేపి తోడు తీసుకుని వెళ్ళేవారు.

వారం రోజులు గడిచాయి. శివయ్యా, నర్సమ్మా, నారాయణ సావిట్లో పడుకున్నారు. ఇన్నాళ్ళూ కంటిమీద కునుకెప్పుడూ సరిగా రాలేదేమో, ఆరోజు ముగ్గురికి నిద్ర బాగానే పట్టింది.

నర్సమ్మ ఏదో భయంకరమైన కలకంటోందో ఏమో నిద్రలోనే ఉలికులికి పడుతోంది. అటూ ఇటూ కదులుతూ కాళ్ళూ చేతులూ కొట్టుకుటోంది. ఇంతలో గదిలో ఏదో దబ్బుమని చప్పుడైంది. నర్సమ్మకి వెంటనే మెలుకువ వచ్చింది. కలలో ఎవరో తనని కొండపై నుంచి కిందికి తోసేసారట. తాను భయంతో అరవబోయింది కాని నోరు పెగల్లేదు. కళ్ళు తెరిచి చూసింది. భర్తా, కొడుకూ ఆదమరచి నిద్రపోతున్నారు. నాలిక ఎండిపోయి దాహంతో నోరు పిడచకట్టుకు పోయింది. అబ్బ .... పాడు కల అని అనుకుంటూ లేచి దగ్గర్లో వున్న నీళ్ళకుండవైపు వెళ్ళింది. కుండ దగ్గర్లోనే ఉండటంతో తోడు కోసం ఎవర్నీ లేపలేదు. అన్నపూర్ణ పోయినప్పటి నుంచీ భయంకొద్దీ, ఉయ్యాల గదిలో లైటువేసే ఉంచుతున్నారు. నీళ్ళకోసం కుండవైపు వెళ్తున్న నర్సమ్మకి ఉయ్యాల గదిలో ఉయ్యాల ఊగుతూ కనిపించింది. నిద్రమత్తు పూర్తిగా వదలని ఆమెకి ఆ క్షణంలో అన్నపూర్ణ చనిపోయిన విషయం కానీ, పసిపాప లేని విషయం కాని జ్ఞాపకంలో లేవు. ఉయ్యాల ఎందుకు ఊగుతోందా అనుకుంటూ ఆ గదిలోకి వెళ్ళింది.

ఖాళీ ఉయ్యాల ఎవరో ఊపినట్టు ఊగుతోంది.

ఉయ్యాలలో పిల్ల ఏమైందా అనుకుంటూ నాలుగువైపులా చూసేసరికి కిటికీలో దున్నపోతులాంటి నల్లపిల్లి ఆమెవంకే భయంకరంగా చూస్తూ కనిపించింది. ఆ పిల్లిని అంతకుముందెపుడూ చూడలేదు. ఎక్కడనుంచి వచ్చిందో ఏమో! పరమ భయంకరంగా వుంది. దానికితోడు ఆ చూపులు నిలువునా తినేసేటట్లున్నాయి. ఆ చూపులు చాలవు అన్నట్లు భయంకరంగా మ్యావ్ అని అరిచి కిటికీ ఊచలలోంచి బయటకు పోవడానికి వీలులేక అక్కడ అటూఇటూ తిరగసాగింది. ఆ అరుపుతో నర్సమ్మకి మైకం వదిలింది. కోడలు చచ్చిపోయిన సంగతి, పాపలేని సంగతి గుర్తుకు వచ్చింది.

భయంతో నర్సమ్మ ఒళ్లు గడ్డకట్టుకు పోయింది. అక్కడనుంచి పారిపోదామంటే కాళ్ళు కదలడం లేదు. అరుద్దామంటే నోరు పెగలడం లేదు. అంతలో జ్ఞాపకానికి వచ్చింది పగబట్టిన దయ్యాలు పిల్లిరూపంలో వచ్చి పీడిస్తాయట - ఎవరో చెప్పారు. సందేహం లేదు. అన్నపూర్ణ దయ్యం అయింది. ఆ దయ్యం నాపై పగ తీర్చుకోవడానికి ఈ పిల్లి రూపంలో ఇక్కడికి వచ్చింది. లేకుంటే ఇన్నాళ్లూ ఎప్పుడూ చూడని ఈ భయంకరమైన పిల్లి ఈ సమయంలో ఇక్కడికి రావడమేమిటి? పైగా నన్ను తినేసేటట్లు ఎలా చూస్తోందో! అనుమానం లేదు. ఇది దయ్యపు పిల్లే. ఉయ్యాల్ని ఊపి ఉంటుంది. లేకుంటే ఖాళీ ఉయ్యాల, ఎవరూ లేకుండా ఎలా ఊగుతుంది. ఆలోచనలు వస్తున్న కొద్దీ నర్సమ్మకి ముచ్చెమటలు పోయసాగాయి. గుండె అతివేగంగా కొట్టుకుంటోంది. రొమ్మును పగలకొట్టుకుని ఏ క్షణంలోనైనా బయటపడి పోతుందేమోననిపిస్తోంది. శక్తినంతా కూడగట్టుకుని నుదుటి మీద చెమట తుడుచుకునే ఉద్దేశ్యంతో అతి కష్టం మీద చేతిని కొద్దిగా ఎత్తింది. తనని అదలిస్తోందని భయపడిందో ఏమో ఆ పిల్లి మరోసారి కెవెడియన్ ఇంజన్‌లా పరమ భయంకరంగా అరిచి, చెంగున ఉయ్యాలమీదికి అక్కడినుంచి నర్సమ్మమీధికి దూకి పారిపోయింది. ఆ తాకిడిలో దాని వాడైన గోళ్ళు ఆమె చేతిని గీరాయి. పిల్లి వేగంగా దూకడంతో ఉయ్యాల అటూ ఇటూ ఊగిపోసాగింది.

నర్సమ్మలో భయం వెన్నులో మొదలై మెరుపులాగా గొంతరవకు వచ్చింది. ఎప్పుడైతే పిల్లి ఢీకొట్టి వెళ్ళిపోయిందో, ఆ భయం పెద్ద కేకగా బయటకు వచ్చింది. పిల్లి గీరడం దయ్యం కాటు అని అనిపించింది. దయ్యం కాటుపడ్డాక ఇంక తానేమీ బతుకుతుంది! ఆ గీతల వంక చూసుకుంటూ ఒక వెర్రికేక వేసి విరుచుకుపడిపోయింది.

ఆ అరుపుకి శివయ్య, నారాయణ ఉలిక్కిపడి లేచి అటు పరుగెత్తుకుంటూ వచ్చారు. మానల్లే

కిందపడివున్న నర్సమ్మని చూసేసరికి వాళ్ళకి మతిపోయింది.

ముఖాన నీళ్ళు చల్లినా ఎంత పిలిచినా ఆమెకి స్పృహ రాలేదు. ఉండుండి ఉలిక్కిపడుతూ ఎటో వెర్రిచూపులు చూస్తుండిపోయింది. వెంటనే బండికట్టి ఆమెని ఆసుపత్రికి తీసుకువెళ్ళి చేర్పించారు.

మర్నాడు సాయంత్రం అవుతున్నా నర్సమ్మకి తెలివిరాలేదు. ఆ పిచ్చి చూపులు అలానే వున్నాయి. డాక్టర్లు ఎన్ని మందులు ఇచ్చినా ఫలితం లేకపోయింది.

నారాయణని ఆమె దగ్గర కూర్చుండబెట్టి తాను ఒక్కసారి పొలం వెళ్ళివస్తానని బయలుదేరాడు. శివయ్య.

పొలంనుంచి తిరిగి వస్తుంటే చీకటి పడింది. సగం దూరం వచ్చేసరికి రోడ్డుకి అడ్డంగా లారీ ఒకటి ఉండిపోయింది. ఆ ఇరుకురోడ్డు మీద అది చెడిపోయింది. మెకానిక్ వచ్చి బాగుచేసేదాకి ఆ రోడ్డు బంద్. అంతే. ఇక చేసేదిలేక చుట్టుదారిన పోడానికి బండిని వెనక్కి తిప్పాడు శివయ్య. ఆ చుట్టుదారి మామూలు దారికి సుమారు నాలుగు రెట్ల దూరం ఉంటుంది. సగం దూరం వచ్చేసరికి బాగా చీకటి పడింది. కొంచెం దూరంలో మంటలు కనిపిస్తున్నాయి. అది స్మశానమన్న విషయం అకస్మాత్తుగా శివయ్యకి గుర్తు వచ్చింది. అన్నపూర్ణని దహనం చేసింది ఆ సమీపంలోనే. ఆ విషయం జ్ఞాపకం రాగానే అతని పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. భయంగా నాలుగువైపులా చూశాడు. ఎక్కడా నరసంచారం లేదు. దూరంగా నక్కలు అతి భయంకరంగా ఊళపెట్టున్నాయి. ఎవరి ఇంట్లోనైనా ఎవరికైనా రోజులు దగ్గరపడితే కుక్కలు గుండెలు అదిరేటట్లు ఆ ఇంటిముందు ఏడుస్తాయి. వాటి కళ్ళకి దయ్యాలు, యమభటులు కనిపిస్తారట. దగ్గరలో ఎక్కడినుంచో కుక్కలు ఆవిధంగా ఏడుస్తున్నాయి. ఆ ఏడుపు తనని చూసి కాదు కదా! అన్నపూర్ణ దయ్యమై ఇక్కడే తిరుగుతుండవచ్చు. అది తన ప్రాణం తీస్తుందేమో! ఆ ఆలోచన రాగానే వెన్నులో షాక్ తగిలినట్లయింది శివయ్యకి. చలిజ్వరం వచ్చినట్లు వళ్ళు ఒణికి పోసాగింది. మరో ప్రక్కన ముచ్చెమటలు. అంతలో దగ్గర్లో జుట్టు విరబోసుకున్న బ్రహ్మరాక్షసిలా వున్న మర్రిచెట్టు మీద వేలాడుతున్న కబోది పక్షులు రెపరెపా రెక్కలు కొట్టుకుంటూ భయంకరంగా అరవసాగాయి. పైనుంచి తీతువు పిట్ట కర్ణకఠోరంగా కూస్తూ వెళ్ళింది. అది వెళ్తుండగా మీద ఏదో పడినట్లనిపించింది. తీతువు అరుస్తుంటే నెత్తురు పడుతుందట. అది ఎవరిమీద పడితే వారికి చావు సమీపించినట్లు లెక్కట. ఇప్పుడు మీదపడ్డది తీతువు రక్తమేనేమో! అదే అయితే ఇంకేముంది! తన చావు మూడిందన్నమాటే.

తన శక్తినంతా కూడగట్టుకుని ఎద్దుల్ని అదిలించాడు శివయ్య. అవి కొంచెం పరుగందుకుని స్మశానం పొలిమేర రాగానే ముందుకి వెళ్ళకుండా మొరాయించాయి. స్మశానం దాటేస్తుండటంతో శివయ్యకు కొంచెం కొంచెం ధైర్యం పుంజుకోసాగింది. కాని ఎద్దులు ఆగిపోవడంతో మళ్ళీ భయం పట్టుకుంది. వాటిని ఎంత అదిలించినా, వెనక్కి వెనక్కి జరుగుతున్నాయే కాని ముందుకి సాగడం లేదు. చీకట్లో అప్పుడప్పుడు ఎద్దుల కళ్ళు భయంకరంగా మెరుస్తూ కనిపిస్తాయి. అవి గింజుకుంటూ తల ఆడిస్తుంటే మధ్య మధ్య వాటి కళ్ళు మెరుస్తూ మరింత భయాన్ని కల్పిస్తున్నాయి. ఎద్దులకి కూడా దయ్యాలు కనిపిస్తాయట. నామీద పగతీర్చుకునే ఉద్దేశంతో అన్నపూర్ణ దయ్యం దారి అడ్డగించి ఎద్దుల్ని ముందుకి పోనీయడం లేదేమో! ఈ ఆలోచన రాగానే శివయ్యకి గుండె ఎగిరివచ్చి గొంతులో పడినట్లయింది. అరవాలని ప్రయత్నించాడు కాని నోటమాట రాలేదు. భయంగా ఎదురుగుండా చూశాడు. ఏదో అస్పష్టమైన ఒక తెల్లని ఆకారం తనవైపే వస్తున్నట్లనిపించింది. దానివకం తేరిపార

చూశాడు. తెల్లని చీర కట్టుకున్న స్త్రీ ఆకారం ..... అన్నపూర్ణ అంత ఎత్తు అంతే లావు. చనిపోయిన రోజున అన్నపూర్ణ తెల్లచీర కట్టుకున్న విషయం జ్ఞప్తికి వచ్చింది. ఇది ఆ దయ్యమే. మానవులు లేని ఈ స్మశానం దాపున నన్ను చంపి, పగ తీర్చుకోవడానికి ఇటే వస్తోంది ... ఆలోచనలతో భయంతో వణికిపోయాడు శివయ్య.

కొంచెం దూరంలో ఉన్న చితిలో మంటలు ఒక్కసారి ఎగిసి కాంతుల్ని విరజిమ్మింది. ఆ మంటల వెలుగులో ఎదురుగా వున్న దయ్యం కనిపించలేదు. ఆ స్థానంలో పడగ పైకెత్తి నిలబడి వున్న బాగా పొడవైన త్రాచుపాము ఉంది. దయ్యాలకి కామరూపం ఉంటుందట. అన్నపూర్ణ దయ్యం ఇప్పుడు ఈ పాము ఆకారంలో వచ్చి ఎద్దుల్ని భయపెడ్తుందేమో! ఈ పామూ, ఆ దయ్యం ఒక్కటే కాకపోతే ఇంతసేపూ కనిపించిన ఆ ఆకారం ఏమైనట్లు?

అంతలో ఆ పాము పడగ దించి చరచర శివయ్య వైపు రాసాగింది. అది చూడగానే అతని ప్రాణాలు గొంతులోకి వచ్చాయి. "వద్దు, వద్దు .... నన్ను చంపొద్దు" అంటూ గావుకేక పెట్టి బండిలోనే విరుచుకుపడిపోయాడు. అంతే శివయ్య ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

అక్కడ ఆస్పత్రిలో నర్సమ్మకి ఎంతకీ తెలివి రాకపోయేసరికి ప్రత్యేకమైన మందుల్ని పక్కవూరి నుండి తెమ్మని నారాయణను పంపించారు డాక్టర్లు. అతను ఆ మందులు తీసుకుని తిరిగి వచ్చేసరికి బాగా చీకటి పడింది. దగ్గర అని వెనకవైపు రోడ్డుమీద బస్ దిగి అక్కడ రివాల్వింగ్ గేట్‌లోంచి ఆస్పత్రి కాంపౌండ్‌లోకి వచ్చాడు నారాయణ. ఆ గేటుకీ, వార్డుకీ మధ్యలో మార్చురీ ఉంది. దానిని సమీపిస్తుండగా ఆ గదిలో శవాలను భద్రపరుస్తారన్న విషయం జ్ఞాపకానికి వచ్చి గుండె ఝల్లుమంది. భయంతో అడుగు ముందుకి పడలేదు. అన్నపూర్ణ శవాన్ని పోస్టుమార్టం చేశాక, శవపంచాయతీ జరిపి మృతదేహాన్ని తమకి అప్పగించేదాకా, ఆ శవాన్ని అందులో వుంచారు. కొంపతీసి అన్నపూర్ణ దయ్యమై అక్కడ తిరగడం లేదు కదా! ఆ ఆలోచన రాగానే కాళ్ళు వణికిపోతూ అడుగు ముందుకి పడలేదు. ఆ చిమ్మచీకటిలో ఏదో తెల్లని ఆకారం తనవైపే వస్తున్నట్లనిపించింది. ఆ ఆకారం సరిగ్గా అన్నపూర్ణంత ఎత్తూ, లావూను. అన్నపూర్ణ చనిపోయిన రోజున తెల్లచీరే కట్టుకుంది. అనుమానం లేదు. ఇది ఆమె దయ్యమే. మాటువేసి తనను మట్టుపెట్టాలని చూస్తోంది. ఎంత అరవదల్చుకున్నా నోరు పెగల్లేదు. కూడబట్టుకుని మరోవైపు పరుగెత్తాడు. వెనకాలనుంచి ఎవరో తన చొక్కా కాలర్‌ను బలంగా పట్టి లాగారు. కెవ్వున కేక వేసి అక్కడే కుప్పకూలిపోయాడు నారాయణ. అతని మృతదేహం భయంతో తెరుచుకుని ఉండిపోయిన కళ్ళతో ఆకాశం వంక చూస్తోంది.

నారాయణ కిందపడిపోగానే అతని కాలర్‌ను పట్టుకున్న తుమ్మకొమ్మ పట్టువదలి అటూ ఇటూ ఊగసాగింది.

వార్డులో నర్సమ్మని చూడడానికి డాక్టరూ, నర్సూ వచ్చారు. అప్పుడే ఆమెకి కొంచెం స్పృహ వచ్చింది. మగతలో ఎదురుగుండా తెల్లచీరలో వున్న నర్సు ఆమె కంటికి అన్నపూర్ణ దయ్యంలాగానే కనిపించింది. స్టెతస్కోపు గుండెలవైపు తెస్తున్న డాక్టర్ యమభటుడు చేతిలో పాశంతో వస్తున్నట్లనిపించాడు. అంతే. వాళ్ళని చూస్తూనే నోరు వెళ్ళబెట్టేసింది. తెరచివున్న ఆ నోటినుంచే నర్సమ్మ ప్రాణాలు ఎటో ఎగిరిపోయాయి.

*(ఆంధ్రభూమి వీక్లీ, 2-8-90)*